# స్వయం సహాయక సంఘాలు.. ప్రగతికి సోపానాలు

భారతదేశంలో 70 శాతం మందికి పైగా ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరిలో ఎక్కువ శాతం మంది నిరక్షరాస్యులు, పేదలు. గ్రామీణ మహిళల పరిస్థితి మరింత దుర్భరం. గ్రామీణ ప్రజలకు రుణ సౌకర్యాలు కల్పించి తద్వారా సామాజిక, ఆర్థిక ప్రగతి సాధించాలనే లక్ష్యంతో 1992వ సంవత్సరంలో నాబార్డు సంస్థ ద్వారా స్వయం సహాయక సంఘాలకు పరపతి సౌకర్యం ప్రారంభించారు. 'స్వచ్ఛందంగా ఏర్పడి సమష్టి బాధ్యతతో, స్వయంశక్తి ద్వారా తమ ఉమ్మడి లక్ష్యాలను సాధించుకోవడానికి ఏర్పడిన చిన్న సముదాయమే స్వయం సహాయక సంఘం' అని నిర్వచించవచ్చు. దేశవ్యాప్తంగా దాదాపు 2.3 లక్షల స్వయం సహాయక సంఘాలు దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న 350 లక్షల కుటుంబాలకు విస్తరించాయి. సగటున ప్రతి సంఘంలో 15 నుంచి 20 మంది సభ్యులుంటారు. గత శతాబ్దంలో ఇవి త్వరితగతిన విస్తరించాయి. 90 శాతానికిపైగా ఇవి మహిళా స్వయం సేవక సంఘాలే. గ్రామీణ ప్రాంతంలో పేద మహిళల సాధికారతకు ఇవి సాధనాలుగా ఉపయోగపడుతున్నాయి. ఇవి ప్రధానంగా పొదుపు, పరపతి, బీమా సేవలను సూక్ష్మ రుణ (మైక్రో క్రెడిట్) వ్యవస్థల సహాయంతో సభ్యులకు అందిస్తున్నా యి. పేద మహిళలు సంఘటితమై పొదుపు చేసుకుంటూ బ్యాంకుల నుంచి సమష్టిగా రుణాలు సేకరించి సభ్యుల జీవనోపాధికి అవసరమైన పరపతి సౌకర్యాలను అందిస్తున్నాయి. నమ్మకం, పరస్పర సహకారం ద్వారా ఈ సంఘాలు సామాజిక పెట్టుబడిని వెలికితీస్తున్నాయి. బ్యాంకుల నుంచి ఎలాంటి ధరావత్తు లేకుండా రుణాలు సులభంగా పొందగలుగుతున్నాయి. ఉమ్మడి జవాబుదారీతనం, తోటివారి ఒత్తిడి అనే సూత్రాల ద్వారా సభ్యులు తాము పొందిన రుణాలను క్రమంతప్పకుండా సకాలంలో చెల్లించేలా చూస్తున్నాయి. ఈ పరపతి సౌకర్యం ద్వారా మహిళలు సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి వీలవుతోంది. తనకు లభించిన రుణాన్ని కుటుంబ అవసరాలకు ఉపయోగించుకుంటూ కుటుంబంలో తనహోదాను పెంచుకోవడానికి దోహదపడుతోంది. స్వయం సహాయక బృందం కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనడం వలన మహిళలలో ఆత్మస్థైర్యం పెరగడం, వృత్తిపరమైన కళల్లో తర్ఫీదు, సమాజంలో గుర్తింపు లభిస్తుంది.

దేశంలో స్వయం సహాయక బృందాల భావనకు 1976లో బంగ్లాదేశ్‌లో ఆచార్య మహ్మద్ యూనస్ ప్రారంభించిన 'గ్రామీ ణ బ్యాంకు' వ్యవస్థ నాంది అని చెప్పొచ్చు. ప్రతి సంవత్సరం 800 మిలియన్ డాలర్ల రుణ పంపిణీ జరుగుతోంది. 70 లక్షల మంది పరపతి సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. వీరిలో 97 శాతం మంది మహిళలే! రుణాలు వసూళ్లు 98 శాతం. బహుశా ప్రపంచంలో ఎక్కడా ఇంత విజయవంతంగా ఈ ప్రయోగం అమలుకావడంలేదేమో! రుణగ్రస్తుల నుంచి వసూలు చేసే వడ్డీ మామూలు బ్యాంకు వడ్డీల కంటే ఎక్కువ అనే విమర్శ ఉన్నప్పటికి, ఎలాంటి ధరావత్తు లేకుండా నిరుపేదలకు రుణ సౌకర్యం కల్పించడం ఊహించలేని పరిణామం. రుణాలు ఇవ్వడం, వసూలు

చేయడం వంటి కార్యకలాపాల నిర్వహణకు అయ్యే ఖర్చులు సహజంగా ఎక్కువ. గ్రామీణ బ్యాంకు వ్యవస్థ ప్రస్తుతం ఒక అంతర్జాతీయ ఉద్యమంగా పరిణమించిందంటే అతిశయోక్తి కాదు.

**సూక్ష్మ రుణాలు:** గ్రామీణ ప్రజల్లో పొదుపును ప్రోత్సహిస్తూ వారి కుటుంబ జీవనోపాధి అవసరాలకు చిన్న మొత్తాల్లో రుణ సదుపాయాలను కలిగించడానికి ఓ వైపు బ్యాంకులు, స్వచ్ఛంద సేవాసంస్థలు, ఇంకోవైపు ప్రభుత్వం చొరవ తీసుకుంటున్నా యి. ఈ రుణాలు స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామీణ పేద ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు అందిస్తున్నారు. ఈ కార్యకలాపాలు విజయవంతం కావడంతో కొన్ని బహుళ జాతి సంస్థలు కూడా ముందుకు వస్తున్నాయి. బ్యాంకింగ్ వ్యవస్థ దేశవ్యాప్తంగా అభివృద్ధి చెందకపోవడం, పేద ప్రజలు బ్యాంకు నిబంధనలమేరకు ధరావత్తు చూపించ లేకపోవడం, వారిలో తగిన చైతన్యం, అవసరమైన నిపుణత లేకపోవడం వల్ల సూక్ష్మ రుణ విధానం వైపు మొగ్గ చూపడం జరుగుతోంది. మన దేశంలో గ్రామీణ పేద ప్రజలకు వార్షికంగా 50,000 కోట్ల రూపాయల రుణం అవసరమైతే కేవలం 5000 కోట్లు రూపాయలు మాత్రమే రుణాలుగా అందుతున్నాయి. 90 మంది శాతం సన్న కారు రైతులకు, కూలీలకు రుణ సౌకర్యం అందుబాటులో లేదు. ఈ లోటు తీరాలంటే సూక్ష్మరుణ వ్యవస్థ విధానం రంగంలోకి రావాలి. రిజర్వు బ్యాంకు సూచనల మేరకు, వాణిజ్య బ్యాంకులు 5 లక్షల రూపాయల వరకు స్వయం సహాయక బృందాలకు రుణాలు ఇవ్వవచ్చు. ఎలాంటి హామీ అవసరం లేదు.

స్వయం సహాయక బృందాలు చురుకుగా పనిచేస్తూ సభ్యులకు సకాలంలో రుణాలు అందించడం ద్వారా వడ్డీ వ్యాపారస్థుల దోపిడీని చాలావరకు అరికట్టడానికివీలైంది. వడ్డీ వ్యాపారస్తుల నుంచి పొందే రుణాల శాతం 66 నుంచి 15కు తగ్గింది. 50 శాతానికి పైగా సభ్యులు ఇంతకుముందు వడ్డీ వ్యాపారస్థుల నుంచి తీసుకున్న రుణాలను స్వయం సహాయక బృందాల నుంచి పొందిన రుణాల ద్వారా తీర్చివేశారు. ఇది పేద ప్రజలరుణ భారాన్ని తగ్గించడానికి తోడ్పడింది. కుటుంబ అవసరాలు తీర్చుకోవడంతోపాటు, పిల్లలకు విద్య, గృహనిర్మాణం, వైద్య ఖర్చులు భరించడానికి వీలవుతోంది. రుణ సదుపాయంతో వ్యవసాయ రంగంలో పెట్టుబడి, పశుగాణిభివృద్ధి, చిన్న వ్యాపారాలకు చేసుకోవడానికి పెట్టుబడి లభిస్తోంది. ఇవన్నీ గ్రామీణ ప్రజలను దారిద్ర్యం నుంచి విముక్తి కలిగిస్తూ గ్రామీణ సంపదకు, ప్రగతికి దోహదం చేస్తున్నాయి.

స్వయం సహాయక బృంద ఉద్యమం దేశవ్యాప్తంగా విజయవంతమైందని చెప్పలేం. దక్షిణాది రాష్ట్రాలలో ఈ ఉద్యమం చురుకుగా ఉంటే ఉత్తరాదిలో అంతంతమాత్రంగా ఉంది. అలాగే సమాజంలో అన్నివర్గాల మీద దీని ప్రభావం సమానంగా లేదు. సాధారణంగా సమాజంలో నిరుపేద వర్గాలు వీటిని సరిగా ఉపయోగించుకోలేకపోతున్నాయి. వ్యవసాయ కూలీలు తరుచుగా జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళతారు. వారికి రుణాలు అందవు. బ్యాంకులు, స్వచ్ఛంద సేవా సంస్థలు నిరాకరిస్తాయి. అలాగే పేదలు తమకు లభించిన రుణాలను అనేక సందర్భాలలో తక్షణ కుటుంబ అవసరాలకు వాడు కుంటారు. ఉత్పాదక కార్యకలాపాలకు వినియోగించనప్పుడు వారు తీసుకున్నరుణం

అలాగే ఉంటుంది. తీర్చలేని పరిస్థితి ఎదురవుతుంది. దీంతో మరింత రుణగ్రస్తులయ్యే ప్రమాదం ఉంది.

**మహిళాసాధికారత:** వివిధ రంగాల్లో మహిళలు వివక్షకు గురవుతున్న నేపథ్యంలో సూక్ష్మరుణ విధానం మహిళల స్వావ లంబనను పెంపొందించడానికి తోడ్పడుతోందని తద్వారా సాధి కారతకు బాట వేస్తోందని పరిశీలకుల భావన. ప్రస్తుతం సమాజంలో కొనసాగుతున్న పితృస్వామిక వ్యవస్థలోని సామాజిక, సాంస్కృతిక మూస నుంచి బయటపడటానికి అవకాశాలు తక్కువ అనే వాదన ఉంది. మహిళల ఉత్పాదక శక్తి పెరగడం వాస్తవమే కానీ తాము ఆర్జించిన వనరులను స్వేచ్ఛగా ఉపయోగించుకొనే అవకాశం లేదు. కుటుంబంలోని పురుషులు సాధారణంగా ఆర్థిక నిర్ణయాలు తీసుకుంటారు. పొదుపు, పరపతి అవకాశాలు కుటుంబ అవసరాలు తీర్చడానికి ఉపయోగపడుతున్నాయి. కానీ మహిళల స్వావలంబనకు దోహదం చేయడం లేదు.

**సవాళ్లు:** స్వయం సహాయక కార్యక్రమాలు పేదరిక నిర్మూలన, మహిళల సాధికారత దిశగా సాగిపోవడంలో ఎదురవుతున్న ఆటంకాలను పరిశీలిస్తే...

- బ్యాంకులు, ప్రభుత్వం, స్వచ్ఛంద సేవా సంస్థలు ఈ కార్యక్రమానికి తగిన ప్రాచుర్యం కల్పించాలి. సమాజంలో అట్టడుగు వర్గాలు ఆశించనమేరకు భాగస్వామ్యం కలిగి ఉండటంలేదు.
- బ్యాంకులు అనుసరించే పరపతి విధానం ప్రోత్సాహకరంగా లేదు. రుణాల విషయంలో పరిమితులు విధించడం, నిరుపే ద వర్గాలకు, పేదలకు ఒకే రకమైన షరతులు విధించడం, అవసరాలకు అనుగుణంగాకాకుండా సంఘంలోని సభ్యులం దరికీ సమానంగా రుణాన్ని పంచడం ఈ కార్యక్రమ ఆశయాలను నీరుకారుస్తున్నాయి. చాలా సందర్భాల్లో సభ్యులు తిరిగి వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. కనుక బ్యాంకింగ్ వ్యవస్థలు క్రియాశీలంగా వ్యవహరించాలి.
- స్వయంసహాయ గ్రూపుల పని సామర్థ్యం వాటి నిర్వహణ తీరుపై ఆధారపడి ఉంటుంది. ఈ రంగంలో అగ్రస్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు మూడింట ఒక వంతు సంఘాల పనితీరు సంతృప్తికరంగా లేదు. నాయకత్వలోపం, తగిన శిక్షణ లేకపోవడం, సభ్యుల్లో నిరక్షరాస్యత మొదలైన కారకాలు వీటి పనితీరును బలహీనపరుస్తున్నాయి.
- సంఘ కార్యకలాపాల్లో ఆశించనమేరకు వినూత్నత్వం కనపడటం లేదు. సంప్రదాయ సిద్ధమైన వ్యవసాయ, పశుగణాభి వృద్ధి, చిరువాణిజ్య కార్యకలాపాలకు మాత్రమే పరిమితమౌతున్నాయి. సభ్యులలో ఔత్సాహిక లక్షణాలను పెంపొందించి చౌక డిపోల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకాల అమలు, సమాచార సాంకేతిక రంగాలకు విస్తరించాలి.
- ఈ సంఘాల ఉత్పత్తులకు మార్కెట్‌లో తగిన గిరాకీ లేదు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు తగినంత ఆదరణ లభించడం లేదు. బహుళ జాతి సంస్థలు ఉత్పత్తి చేసే బ్రాండెడ్ వస్తువులతో పోటీ పడలేకపోతున్నాయి. నాణ్యతలో మార్కెట్ వస్తువు లకు తీసిపోనప్పటికీ ఆకర్షణీయ ప్యాకింగ్, పబ్లిసిటీ లేకపోవ డం వలన వీటి అమ్మకాలు ఆశాజనకంగా లేవు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం ఈ రంగంలో చొరవ చూపాలి.

- కేవలం స్వయంసహాయ సంఘ కార్యకలాపాలవల్లే గ్రామీణ పేదరికం తగ్గదు. పశ్చిమ బెంగాల్, కేరళలాంటి రాష్ట్రాలలో అమలైన భూ సంస్కరణలు పేదరికం నిర్మూలనకు దోహదం చేశాయి. గ్రామీణ పేదరిక నిర్మూలనకు బహుముఖ వ్యూహం రూపొందించి అమలు చేయాలి.
- సూక్ష్మరుణాలను అందించే కొన్ని సవ్వచ్ఛంద సంస్థలు మితి మీరిన వడ్డీలను వసూలు చేస్తున్నాయని, సభ్యులను అనేక సందర్భాల్లో సభాముఖంగా అవమానించడం, వారి ఆస్తులను జప్తు చేయడం వంటి అమానుష చర్యలకు పాల్పడుతు న్నాయనే వాదన ఉంది. కొందరు సభ్యులు ఈ అవమానాన్ని భరించలేక ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలుకూడా ఉన్నాయి. ఈ రంగాల్లో ప్రభుత్వ పర్యవేక్షణ అవసరం.

ఉత్తమ ఆశయంతో ప్రారంభించిన ఈ ఉద్యమం గ్రామీణప్రజల ముఖ్యంగా మహిళల స్థితిగతులను మెరుగుపర చడంలో గణనీయమైన కృషిని చేస్తున్నాయనే విషయం వాస్తవం. మహిళలు ఆర్థికంగా సామాజికంగా, రాజకీయంగా సాధికారత వైపు ప్రయాణించడానికి ఇవి దోహదం చేస్తున్నాయి. ఈ సంఘాల ద్వారా మహిళల మీద జరుగుతున్న దౌర్జన్యాలను ప్రతిఘటిం చడం, గ్రామాలలో కనీసావసరాలైన శుభ్రమైన నీరు, విద్య మొదలగు వాటికి కోసం డిమాండు చేయడం వంటివి ఊపందు కున్నాయి. ఇది హర్షించదగిన పరిణామం. దీనిని మరింత ముందుకు తీసుకువెళ్లాలి. దేశంలో స్వయం సహాయక బృందాల భావనకు 1976లో బంగ్లాదేశ్‌లో ఆచార్య మహ్మద్ యూనస్ ప్రారంభించిన 'గ్రామీణ బ్యాంకు' వ్యవస్థ నాంది అని చెప్పొచ్చు. ప్రతి సంవత్సరం 800 మిలియన్ డాలర్ల రుణ పంపిణీ జరుగుతోంది. 70 లక్షల మంది పరపతి సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు. వీరిలో 97 శాతం మంది మహిళలే! రుణాలు వసూళ్లు 98శాతం. బహుశా ప్రపంచంలో ఎక్కడా ఇంత విజయవంతంగా ఈ ప్రయోగం అమలుకావడంలేదేమో! రుణగ్రస్తుల నుంచి వసూలు చేసే వడ్డీ మామూలు బ్యాంకు వడ్డీల కంటే ఎక్కువ అనే విమర్శ ఉన్నప్పటికి, ఎలాంటి ధరావత్తు లేకుండా నిరుపేదలకు రుణ సౌకర్యం కల్పించడం ఊహించలేని పరిణామం. రుణాలు ఇవ్వడం, వసూలు చేయడం వంటి కార్యకలాపాల నిర్వహణకు అయ్యే ఖర్చులు సహజంగా ఎక్కువ. గ్రామీణ బ్యాంకు వ్యవస్థ ప్రస్తుతం ఒక అంతర్జాతీయ ఉద్యమంగా పరిణమించిందంటే అతిశయోక్తి కాదు.